క్లుప్తంగా

ఏయూ వీసీని కలిసిన కె.కె.రాజు



ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: ఆంధ్రా యూనివర్సిటీ ఉప కులపతిగా రెండో సారి నియమితుడైన ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యుడు సేనాపతి అప్పారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా తహసీల్దార్ కార్యాలయ అభివృద్ధి పనులు



తహసీల్దార్ కార్యాలయ భవనంపై జరుగుతున్న శ్లాబ్ పనులు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే టైల్స్ పనులు, కార్యాలయ శ్లాబ్ పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కార్యాలయ అభివృద్ధికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రూ.5 లక్షల నిధులు అందజేశారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

పాపా హోం పిల్లలకు సహకారం



పాపా హోంలో పిల్లలతో కలిసి భోజనం తింటున్న కమలాకర్

సీతమ్మధార: సీతమ్మధార బాలికల పాపా హోంలోని పిల్లల కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మాజీ జాతీయ క్రికెటర్ జి.వి.కమలాకర్ అన్నారు. తన జన్మదినం సందర్భంగా శనివారం ఉదయం పాపా హోంలో పిల్లలకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం సదుపాయం కల్పించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పాపా హోం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'గ్రీవెన్స్'తో సమస్యల పరిష్కారం

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట తమను ప్రలోభాలకు గురిచేయవద్దని అంగన్‌వాడీలు కోరుతూ శనివారం మూడు బృందాలుగా ఏర్పడి నిరసన చేపట్టారు. ఎయిర్‌పోర్ట్ పీఎస్ పోలీసులను కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున మోహరించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి వెంకటేశ్వరి మాట్లాడుతూ విధుల్లోకి చేరాలంటూ అంగన్‌వాడీ వర్కర్లను, ఆయాలను వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఆరోపించారు.

డ్వాక్రా మహిళలకు వెన్నుదన్ను

- రుణమాఫీతో అండగా నిలిచిన వైఎస్ జగన్ సర్కార్
- పొదుపు సంఘాల సభ్యుల్లో సంతోషాలు
- జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు



కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా సంఘాల మహిళలు



వైఎస్సార్ ఆసరా ప్రీ లాంచింగ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు

తాటిచెట్లపాలెం: డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచిందని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకు అన్నారు. రుణమాఫీ ద్వారా పొదుపు సంఘాల మహిళల మోములో సంతోషాలు నింపుతూ, వారినే లక్షాధికారులుగా చేస్తూ ముందుకు దూసుకుపోతోందని పేర్కొన్నారు. సోనియాగాంధీ నగర్‌లోని సామాజిక భవనంలో శనివారం వైఎస్సార్ ఆసరా పథకం ప్రీ లాంచింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని అన్నారు. రాష్ట్రంలో ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడమే కాకుండా ప్రతి పథకానికి మహిళలనే ప్రత్యక్ష లబ్ధిదారులుగా చేసి, వారి ఖాతాల్లోకి ఆయా పథకాల సొమ్మును జమచేస్తున్నారని తెలిపారు. చాలా మంది నాయకులు ఎన్నికల ముందు ఒకలా.. తరువాత మరోలా మాట్లాడుతుంటారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చి ప్రతీ కుటుంబంలో సంతోషాలు నింపారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని, తద్వారా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని హనోకు పిలుపునిచ్చారు.

23న రూ.1.37 కోట్ల విడుదల

సీవో రమణి మాట్లాడుతూ వార్డులోని సుమారు 12 ఎస్ఎల్ఎఫ్‌ల్లో గల 303 పొదుపు సంఘాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో సున్నా వడ్డీ కింద సుమారు రూ.1.69 కోట్లు, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా సుమారు 815 మంది మహిళలకు రూ.1.53 కోట్లు అందజేసిందన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా కింద 4వ విడతగా ఈ నెల 23వ తేదీ మంగళవారం రూ.1.37 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. వార్డు పరిధిలో ఒక్క ఆసరా పథకం ద్వారా సుమారు నాలుగు విడతల్లో సుమారు రూ.5.47 కోట్లను ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమచేసిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, పార్టీ నాయకులు హరిపట్నాయక్, రాజు యాదవ్, మాత ఈశ్వరరావు, దుర్గ, నాయుడు, ఆర్పీలు, అధిక సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో అందరికీ మేలు



డ్వాక్రా సంఘంలో 8 ఏళ్లుగా సభ్యురాలిగా ఉన్నాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నెలలోనే మాకు రుణమాఫీ చేశారు. గతంలో ఎవ్వరూ ఇలా చేయడం చూడలేదు. సంఘంలోని ప్రతి ఒక్కరం వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధి పొందుతున్నాం. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం.

– సుందరపల్లి దుర్గాభవాని, సోనియాగాంధీ నగర్

జగనన్న ప్రభుత్వంలో రుణాల మాఫీ



గతంలో ఏ నాయకుడు ఇలా రుణమాఫీ చేయలేదు. మేం తీసుకున్న రుణాలను మేమే చెల్లించేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు 3 విడతలు రుణమాఫీ చేశారు. ఈ నెల 23న 4వ విడత రుణమాఫీ చేయనున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– వి.నూకరత్నం, సోనియాగాంధీనగర్

ఒక్కో సభ్యురాలికి రూ.60 వేల లబ్ధి



పొదుపు సంఘంలో 12 ఏళ్లుగా సభ్యురాలిగా ఉన్నాను. గతంలో రుణమాఫీ లేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత నాలుగు విడతల్లో రుణమాఫీ ద్వారా ఒక్కో సభ్యురాలికి సుమారు రూ.60 వేల లబ్ధి చేకూరింది. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట నెరవేర్చారు.

– ఎల్.దేవి, లక్ష్మీనారాయణపురం

ఇంటి పంటే ఆరోగ్యం



శిక్షణకు హాజరైన ఔత్సాహికులు



రైతునేస్తం వ్యవస్థాపకుడు వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

సీతంపేట: మన ఇంటి పంటే మనకు ఆరోగ్యమని రైతునేస్తం వ్యవస్థాపకుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత వై.వెంకటేశ్వరరావు అన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, రైతునేస్తం సంయుక్తంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన ఇంటి పంట శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించుకుని ఆరోగ్యంగా జీవిద్దామని పిలుపునిచ్చారు. ఇంటి టెర్రస్, మెట్లపై, ఖాళీ ప్రదేశంలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఇచ్చే మొక్కలు పెంచుదామన్నారు. మనతోపాటు మన ఇంటి చుట్టుపక్కల వారిని సైతం మొక్కలు పెంచేందుకు ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. మహిళలు, పురుషులు, పిల్లలు, పెద్దలు ఇలా అన్ని వర్గాల వారు కూరగాయలు పెంపకంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటి పంట పెంపకంలో మెళకువలు, సూచనలు, జాగ్రత్తలు వివరించారు. సదస్సుకు హాజరైన వారికి బత్తిలి వంకాయ, గుంటూరు మిర్చి, పుడుగు మిర్చి, గోదావరి లంకలో వంకాయ, ఏలూరు టమాట విత్తనాలు, బళ్లారి ఉల్లి నారు, బంతి నారు పంపిణీ చేశారు. అనంతరం వెంకటేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, రైతు కర్రి రాంబాబు, సంస్థ అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, కార్యదర్శి చెవ్వాకుల అశోక్, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, గ్రీన్ క్లైమైట్ టీం కార్యదర్శి జె.వి.రత్నం పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేతలకు అభినందన



విజేతలతో కంచరపాలెం సీఐ భాస్కర్‌రావు, హోమ్ నిర్వాహకులు

మర్రిపాలెం: ఈ నెల 6, 7 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన జేకేఎస్ సౌత్ ఏషియన్ కరాటే చాంపియన్‌షిప్‌లో అన్ని హన్నా హోమ్ చిన్నారులు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శనివారం హోమ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారి విజేతలను ముఖ్య అతిథి కంచరపాలెం ఐదో పట్టణ సీఐ ఎస్.భాస్కర్‌రావు అభినందించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులు చదువుతోపాటు కరాటే వంటి క్రీడలు నేర్చుకోవడం వల్ల ఆరోగ్యం, క్రమశిక్షణ కలిగి ఉంటారన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. హోమ్ నిర్వాహకులను సీఐ అభినందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు అనురాధ మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన కరాటే పోటీల్లో తమ హోమ్ నుంచి జి.లక్ష్మి, కె.పింకి, వి.గౌతమ్, ఎస్.కీర్తిమీనా బంగారు పతకాలు, బి.భరత్‌కుమార్, పి.ఆదిలక్ష్మి సిల్వర్ మెడల్స్, నూకరత్నం, ఎస్.ప్రవీణ్‌కుమార్, యు.మధులత బ్రాంజ్ పతకాలను సాధించారని తెలిపారు. నార్వేలో జరగనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు ఈ చిన్నారులు ఎంపికయ్యారని చెప్పారు. కరాటే కోచ్ పడాల నాగార్జునకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సేద్యానికి సాంకేతిక సాయం

అధికారులకు జేసీ విశ్వనాథన్ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఆధునిక సాంకేతిక సహకారంతో రైతులకు మెరుగైన సేవలందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. తన చాంబర్‌లో శనివారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి, ధాన్యం కొనుగోలు సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జేసీ.. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 10 ప్రొక్యూర్ సెంటర్లలో ఆరు వేల టన్నులకు గానూ 4,280 టన్నులు ప్రొక్యూర్ చేసినట్లు గుర్తు చేశారు. ఫిబ్రవరి రెండో వారంలోగా లక్ష్యాలను సాధించాలన్నారు. ఫిబ్రవరి 15లోగా రబీలో వేసిన పంటను మొత్తం ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి పంట రుణాలు రెన్యువల్ చేయాలని ఆదేశించారు. ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీపీ ప్రసాద్‌రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి, మండల, గ్రామ స్థాయిలో చర్చించిన విషయాలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. పశు సంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, అసిస్టెంట్ ఎల్.డి.ఎం.రమణబాబు, పౌర సరఫరాల కార్పొరేషన్ డీఎం రాజేశ్వరి, ఉద్యాన వన శాఖ అధికారి మన్మధరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఎన్నికల శంఖారావం'కు తరలిరండి

- ముఖ్యమంత్రి జగన్ సభను జయప్రదం చేయండి
- పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు పిలుపు



కార్పొరేటర్లు, పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో భీమిలి నియోజకవర్గంలో జరగనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గం నుంచి సీఎం జగన్ చేపడుతున్న ఎన్నికల శంఖారావాన్ని జయప్రదం చేయాలని కోరారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర అభివృద్ధితోపాటు నవరత్నాలు పథకాల ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేశారన్నారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా.. 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, కె.వి.ఎన్.శశికళ, కో–ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షులు నీలి రవి, పైడి రమణ, రత్నాకర్, జేసీఎస్ మండల కన్వీనర్లు బులుసు జగదీష్, కర్రి మురళీకృష్ణారెడ్డి, వసంతల అప్పారావు, డైరెక్టర్లు నూకరాజు, ఎస్.రవికుమార్, రాయుడు శ్రీనివాస్, పి.శ్రీను, ఐ.రవికుమార్, సీనియర్ నాయకులు గురుమోజీ, బి.కిరణ్, బల్లా శ్రీనివాస్, ఎస్.సురేష్, ఎ.గోపి, కె.చిన్నా, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

22న అక్కయ్యపాలెం పరస



భూలోకమాతకు కిరీటం అలంకరిస్తున్న మళ్ల విజయప్రసాద్

సీతంపేట: గౌరీ సేవా సంఘం అక్కయ్యపాలెం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ సోమవారం భూలోకమాంబ, ముత్యమాంబ, కుంచుమాంబ, వెంకటేశ్వరస్వామి, సీతారాముల వారి పరస మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ తెలిపారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోజు ఉదయం 5 గంటలకు అమ్మవార్ల ప్రథమ పూజతో పరస ఉత్సవం ప్రారంభమవుతుందన్నారు. మూడుగుళ్ల వద్ద సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు తప్పెటగుళ్లు, సేవా గరిడీలు, కోలాటం, చెక్క భజన వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణతో పరస కనుల పండువగా జరుగుతుందన్నారు. ప్రజలు పాల్గొని అమ్మవార్లను దర్శించి పరసను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు పి.ఎస్.జె.వి.ప్రసాద్, కమిటీ చైర్మన్ రాజగిరి అప్పలరాజు, ఉపాధ్యక్షులు మళ్ల త్రినాథరావు, డిప్యూటీ ప్రెసిడెంట్ పిల్లా పకీరు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఆడారి పారుపల్లి రవి, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్, ఆడిటర్ పెంటకోట సత్యనారాయణ, పాలక వర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కిరీటం బహూకరణ..

భూలోకమాత అమ్మవారికి స్థానిక నాయకుడు మళ్ల శివ ఇత్తడితో చేసిన కిరీటం బహూకరించారు. మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ చేతుల మీదుగా అమ్మవారికి అలంకరించారు.

బాలరాముడి వర్ణ చిత్రాల పోటీకి ఆహ్వానం

మహారాణిపేట: అయోధ్యలో ప్రారంభానికి ముస్తాబైన రామాలయం గురించే దేశం మొత్తం మాట్లాడుకుంటున్న శుభ తరుణంలో ప్రత్యేకించి చిన్నారులను ఈ సంబరాలలో భాగస్వాములు చేయాలని వేద విజ్ఞాన సమితి నిర్ణయించింది. వారి కోసమే బాలరాముడి వర్ణచిత్రాల పోటీ నిర్వహించి, మొదటి ముగ్గురు విజేతలకు రూ. 1,116 బహుమతిగా అందించడంతో పాటు పాల్గొన్న వారందరికీ శ్రీరాముని ఆశీసులతో కూడిన ప్రశంసాపత్రాలనూ అందించనుంది. ప్రముఖ చిత్రకారులు సుదురుపాటి అప్పలనరసయ్య (సయ్య మాస్టర్) పోటీల వివరాలను వెల్లడించారు. 6 నుంచి 15 ఏళ్ల మధ్య గల పిల్లలు ఎవరైనా, ఏ ప్రాంతం నుంచైనా అయినా వారి ఇంట్లోనే ఉండి ఈ పోటీలో పాల్గొనవచ్చని అప్పలనరసయ్య తెలిపారు. బాల రాముడు ప్రధాన అంశంగా వేసిన ఒక వర్ణ చిత్రాన్ని, పేరు, ఊరు, చదువుతున్న తరగతి రాసి ఫొటో తీసి ఈనెల 21వ తేదీలోపు సెల్ నంబర్ 81256 74182కు వాట్సాప్ ద్వారా పంపాలని ఆయన కోరారు. గీసిన చిత్రంతోపాటే, ప్రశంసా పత్రంపై ముద్రించేందుకు క్లోజ్–అప్ ఫొటోను కూడాపై పంపాలని కోరారు. పోటీ విజేతలను ఈ నెల 22న సాయంత్రం ఏడు గంటలకు ప్రకటిస్తారు. ప్రశంసా పత్రాలు వాట్సాప్ ద్వారా పంపిస్తామని సయ్య మాస్టర్ పేర్కొన్నారు.

ఆళ్వార్‌దాస్ ఆశయాల సాధనకు కృషి



ఆళ్వార్‌దాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభావతి, శుభ

మురళీనగర్: వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకర ఆళ్వార్ దాస్ వాకర్ ఉద్యమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో శనివారం మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆళ్వార్‌దాస్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ ప్రజల్లో నడక ద్వారా ఆరోగ్యం మెరుగుపరుచుకునే విధానాలపై అవగాహన కల్పించేందుకు వాకర్స్ క్లబ్‌లను ఆళ్వార్ దాస్ స్థాపించి ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. ఆయన ఆశయాల సాధనకు వనితా వాకర్స్ క్లబ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ముందుగా డిస్ట్రిక్ట్–101 పాస్ట్ గవర్నర్ ఉప్పలపాటి శుభతో కలిసి ప్రభావతి ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, వైశాఖి స్పోర్ట్స్ పార్కు వాకర్స్ పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం పదిలం



ఆళ్వార్‌దాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రమౌళి, వాకర్స్ ప్రతినిధులు

మురళీనగర్: ప్రతి రోజూ కాసేపు నడక ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తుందని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఆయన ఆధ్వర్యంలో శనివారం ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్ దాస్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి నడకను మించిన గొప్ప ఔషధం మరొకటి లేదన్నారు. ఆళ్వార్‌దాస్ పిలుపు మేరకు దేశ విదేశాల్లో వేలాదిగా వాకర్స్ క్లబ్‌లు స్థాపించారని, రెండున్నర లక్షల సభ్యులతో అవి 1600 శాఖోపశాఖలుగా విస్తరించాయని చెప్పారు. ముందుగా ఆళ్వార్‌దాస్ చిత్రపటానికి చంద్రమౌళి, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిస్ట్రిక్ట్–101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, ఎం.భాస్కరరావు, సీహెచ్ కృష్ణమూర్తి, కేజీ కృష్ణారావు, ఉపాధ్యక్షుడు ఏవీ సుబ్బారావు, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, వాకర్స్ క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజ్, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, కె.ప్రసాదరావు, వి.అప్పారావు, సీహెచ్ ప్రసాదరావు, ఎస్.శ్రీనివాసరావు, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సత్యనారాయణరాజు



స్వాతంత్య్రోద్యమ నవలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ తదితరులు

సీతంపేట: చారిత్రక నవలా రచయిత ఎస్.డి.వి.అజీజ్ గొప్ప సాహిత్య సేవకుడని పలువురు వక్తలు కొనియాడారు. స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సత్యనారాయణరాజు జీవిత గాధను అజీజ్ తెలుగులో నవలా రూపంలోకి తేగా, రచయిత్రి పారనంది నిర్మల హిందీలోకి అనువదించి పుస్తకాన్ని ప్రచురించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం ఈ నవలను మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జీవిత విశేషాలతోపాటు ఆనాటి సామాజిక పరిస్థితులను, స్వాతంత్య్ర ఉద్యమం నాటి సంఘటనలు నేటి తరానికి రచయిత నవల ద్వారా అందించారన్నారు. స్వాతంత్య్ర సంగ్రామ ఉద్యమంలో అల్లూరి సత్యనారాయణరాజు చేసిన పోరాటాన్ని కళ్లకు కట్టినట్టు రాయడం అజీజ్‌కే చెందిందన్నారు. విశ్రాంత హిందీ ఉపాధ్యాయిని బి.రాధారాణి పుస్తకాన్ని సమీక్షించారు. అరసం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, న్యాయవాది అల్లూరి సీతారామరాజు, ఏపీ క్షత్రియ ఫెడరేషన్ అధ్యక్షుడు చెరుకూరి వెంకటపతిరాజు, రచయితలు అజీజ్, నిర్మల, కె.జి.వేణు, మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, శ్యాంసుందర్, రాజు, బొట్ట అప్పారావు, బసుపోతన పాల్గొన్నారు.

క్వార్టర్ ఫైనల్స్‌లో జీవీఎంసీ జట్టు విజయం

గాజువాక: జీవీఎంసీ, హెచ్‌పీసీఎల్ జట్ల మధ్య జింక్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్స్ మొదటి క్వార్టర్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో జీవీఎంసీ జట్టు ఐదు పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

దోమల నిర్మూలనకు చర్యలు



వాకర్స్ పార్కులో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టారు. కొద్ది రోజులుగా పార్కుతో పాటు పరిసరాల్లో దోమల సంఖ్య పెరిగిపోవడంతో సందర్శకులు, వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం వేళ దోమల దాడి ఎక్కువైంది. దీనిపై వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి చెల్వరాజు మలేరియా నిర్మూలన విభాగానికి సమాచారం అందించారు. ఈ మేరకు మలేరియా నిర్మూలనా విభాగం సిబ్బంది పార్కులో దోమల నిర్మూలనకు శనివారం సాయంత్రం ఫాగింగ్ చేశారు. దీనిపై వాకర్స్ క్లబ్ సభ్యులు, వాకర్స్, సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతుల సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.